# హరిత విప్లవ పితామహుడికి భారతరత్న..!

## (భారత హరిత విప్లవ పితామహుడు ఎం. ఎస్. స్వామినాథన్‌కు మరణానంతరం పౌర అత్యున్నత సేవా పురస్కారం "భారతరత్న" ప్రకటించిన సందర్భంగా అక్షరాభిషేకం)

భరతమాత ముద్దు బిడ్డ, సువిశాల భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త 98 - ఏండ్ల ఎం. ఎస్. స్వామినాథన్ చెన్నై నగరంలోని తన నివాసంలో 28 సెప్టెంబర్ 2023న తుది శ్వాస విడిచిన విషయం మనకు తెలుసు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు, కర్షక వర్గం సహితం ప్రశంసించిన మహా మేధావి, కర్షక పక్షపాతి మన స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌర సేవా పురస్కారం "భారతరత్న"ను పక్రటించడం మనందరికీ సంతోషదాయకం.

### పాఠశాల విద్య:

తమిళనాడు రాష్ట్ర తంజావూరు జిల్లా, కుంభకోణంలో 07 ఆగష్టు 1925న ఎం కె సాంబశివన్-పార్వతీ తంగమల్ దంపతులకు జన్మించిన మన్కోంబు సాంభశివన్ స్వామినాథన్ పాఠశాల చదువులు కుంభకోణం పట్టణంలోని కాథలిక్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లోపూర్తి చేశారు. చిన్నపాటి నుంచే వ్యవసాయదారులతో కలిసిమెలిసి తిరుగుతూ వ్యవసాయ పనులు చేయడానికి ఇష్టపడేవారు. వ్యవసాయ దిగుబడులు తక్కువగా రావడం, పేద రైతుల ఆకలి కేకలు, వాతావరణ మార్పులు, పంటలకు పట్టే తెగుళ్లను ప్రత్యక్షంగా చూసిన స్వామినాథన్ మెదడులో ఈ సమస్యలు నాటుకుపోయాయి. తల్లితండ్రుల మెడిసిన్ చేయమని సూచించినప్పటికీ సీనియర్ సెకండరీలో జంతుశాస్త్రం చదివిన తరువాత 1943లో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బెంగాల్ చవిచూసిన కరువు, ఆహార ధాన్యాల కొరతను చూసిన స్వామినాథన్ ఈ రంగం పట్ల ఆలోచించడం మొదలు పెట్టారు.

### ఉన్నత విద్య - పరిశోధనలు:

ట్రివేండ్రమ్ మహరాజ కాలేజీలో జువాలజీలో డిగ్రీ పూర్తి చేసి, మద్రాస్ యూనివర్సిటీలో 1940-44 మధ్య వ్యవసాయ శాస్త్రంలో బిఎస్‌సి డిగ్రీ పొందారు. 1947లో 'ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'లో చేరి 'జెనెటిక్స్', 'ప్లాంట్ బ్రీడింగ్' రంగాల్లో అధ్యయనం చేశారు. ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ యునెస్కో అందించిన స్కాలర్‌షిప్‌తో నెథర్‌లాండ్‌లో జెనెటిక్స్ పరిశోధనలు మొదలు పెట్టారు. అనంతరం జర్మనీలోకి 'మ్యాక్స్ ప్లాంక్ ఇనిస్టిట్యూట్ ఫర్ ప్లాంట్ బ్రీడింగ్' పరిశోధనా సంస్థను సందర్శించారు. 1950లో యూకేలోని 'యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్'లో పరిశోధనలు కొనసాగించి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' పట్టా పొందారు. 1953లో అమెరికా 'విస్కాన్సన్ యూనివర్సిటీ'లో 15 మాసాలు పోస్ట్-డాక్టోరల్ పరిశోధనలు కొనసాగించారు. 1954లో భారత్‌కు వెనుదిరిగి 'సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్', కటక్‌లో పని చేసిన తర్వాత 'ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్', ఢిల్లీలో చేరి 1972 వరకు కొనసాగారు.

### రైతు పక్షపాతిగా పరిశోధనలు:

1949లో ఆలుగడ్డలు, గోధుమలు, వరి, జ్యూట్ లాంటి పంటల జెనెటిక్స్ రంగాల్లో పరిశోధనలు ప్రారంభించిన స్వామినాథన్‌తో పాటు నోబెల్ బహుమతి గ్రహీత 'నార్మన్ బోర్లాంగ్' లాంటి శాస్త్రజ్ఞులతో కలిసి, నాటి పేదరికంలో పాటు కరువుకాటకాలను తట్టుకొనేలా అధిక దిగుబడులు ఇవ్వగల విత్తన వెరైటీలను కనుగొన్నారు. 'యూఎన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్' చేత 'ఫాదర్ ఆఫ్ ఎకనమిక్ ఎకాలజీ'గా కూడా పిలువబడిన స్వామినాథన్ 1960-70ల్లో నాటి దేశ వ్యవసాయశాఖామాత్యులైన సి. సుబ్రహ్మణ్యం, జగ్జీవన్‌రామ్ లాంటి పెద్దలతో కలిసి 'హరిత విప్లవానికి' పునాదులు వేశారు. వీరి ప్రయత్నంతో నూతనంగా రూపొందించిన గోధుమ, వరి వంగడాలతో అనేక రెట్లు అధికంగా దిగుబడులు రాబట్టి రైతుల ఆరాధ్య దైవంగా నిలిచారు. తన జీవిత కాలంలో 254 పరిశోధనా వ్యాసాలను పలు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ముద్రితం చేయించగలిగారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి:

వ్యవసాయాన్ని ఇష్టపడే బహుముఖ ప్రజ్ఞాశాలి స్వామినాథన్‌లో ఆగ్రోనమిస్ట్, వ్యవసాయ శాస్త్రవేత్త, ప్లాంట్ జెనెసిస్ట్, పరిపాలనాదక్షుడు, మానవతావాది లాంటి పాత్రలు కనిపిస్తాయి. ఆహార అభద్రత, కరువు, పేదరికం లాంటి సమస్యలకు విరుగుడుగా స్వామినాథన్ కృషితో దేశవ్యాప్తంగా అధిక దిగుబడులు అందించే నూతన రకాల వరి, గోధుమ వంగడాలను సృష్టించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందడాన్ని రైతులకు పరిచయం చేసిన కర్షక పక్షపాతి మన స్వామినాథన్ అనడంలో అతిశయోక్తి లేదు. వ్యవసాయ రంగంలో అంతర్జాతీయ స్థాయి మేధావిగా పేరొందిన స్వామినాథన్ 'ఎవర్‌గ్రీన్ రెవొల్యూషన్' అనే కొత్త నినాదాన్ని అందిస్తూ, 'శాశ్వత వ్యవసాయ ఉత్పత్తి' అనబడే మాటల్ని నిజం చేశారు.

### పురస్కారాలే పులకించిన వేళ?!

భారతదేశవ్యాప్తంగా అధిక దిగుబడులు ఇవ్వగల వరి, గోధుమ వంగడాలను విజయవంతంగా ప్రవేశ పెట్టినా స్వామినాథన్ 1987లో తొలి 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' పొంది, చెన్నైలో 'ఎం ఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' స్థాపించారు. వీరు చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా 1971లో 'రామన్ మెగసెసే అవార్డు'ను, 1986లో 'అల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు'ను పొందారు. ఎం ఎస్ స్వామినాథన్ అద్వితీయ కృషిని మెచ్చిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ(1967), పద్మ భూషన్(1972), పద్మ విభూషన్(1989) పురస్కారాలు పొందారు. వ్యవసాయ రంగానికి అందించిన పరిశోధనా ఫలితాలకు ముగ్దులైన పౌర సమాజం 'హెచ్. కె. ఫిరోడియా అవార్డు', 'లాల్ బహదూర్ శాస్త్రీ నేషనల్ అవార్డు', 'ఇందిరా గాంధీ ప్రైజ్'లతో ఆయన్ని సత్కరించింది. నేడు భారత అత్యున్నత పౌర సేవా పురస్కారం "భారతరత్న" కూడా మరణానంతరం చేరడం హర్షదాయకం.

### అత్యుత్తమ సంస్థల అధిపతిగా?!

అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాలను అందిస్తూనే, జాతీయ స్థాయి వ్యవసాయ సంబంధ సంస్థలైన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్'తో పాటు 'ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'కు డైరెక్టర్ జనరల్‌గా సమర్థవంతమైన సేవలు అందించి మంచి పరిపాలనాదక్షుడిగా చరిత్రలో నిలిచిపోయారు. 1979లో వ్యవసాయ మంత్రిత్వశాఖకు 'ప్రిన్సిపల్ సెక్రటరీ'గా కూడా విశిష్ఠ సేవలు అందించారు. 1980-82లో 'ప్లానింగ్ కమిషన్' సభ్యుడిగా, 1988లో 'ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నాచురల్ రిసోర్సెస్' అధ్యక్షుడిగా, 2004లో 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్'కు అధ్యక్షుడిగా ఎనలేని సేవలను దారపోశారు. స్వామినాథన్ అందించిన సేవలకు గుర్తుగా టైమ్స్ మ్యాగజీన్ చేత '20వ శతాబ్దపు అత్యంత ప్రతిభ కలిగిన 20 మంది ఆసియా' వాసుల్లో మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌లతో పాటు ఒకడిగా గుర్తింపబడ్డారు. 'న్యూక్లియర్ రీసెర్చ్ లేబొరేటరీ'ని స్థాపించడంతో పాటు 'ఇంటర్నేషనల్ క్రాఫ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమి-అరిడ్ ట్రోపిక్స్' వ్యవస్థాపకంలో భాగస్వామి అయ్యారు. చైనా, వియత్నామ్, మియాన్మార్, థాయ్‌లాండ్, శ్రీలంక, పాకిస్థాన్, ఇరాన్, కాంబోడియాల్లో వ్యవసాయ పరిశోధనాలయాల స్థాపనకు అమూల్య సలహాలు ఇచ్చారు. 2002-05 మధ్య 'యూఎన్ మిలీనియమ్ ప్రాజెక్ట్'కు సహ-అధ్యక్షుడిగా పని చేసిన స్వామినాథన్‌ను నాటి రాష్ట్రపతి ఏ పి జె అబ్దుల్ కలాం చొరవతో రాజ్యసభకు ఎంపీగా నామినేట్ చేయబడ్డాడు.

### నిష్కళంక ఆకర్షణీయ వ్యక్తిత్వం:

2022లో స్వామినాథన్ భార్య మీనా స్వర్గస్థులైనారు. వీరికి సౌమ్య, మధుర, నిత్య అనే ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ప్రపంచ స్థాయి వ్యవసాయరంగ నిపుణుడిగా అందరి మన్ననలు పొందిన స్వామినాథన్ ఫలవంతమైన జీవితం నేటి యువతకు మార్గదర్శకం కావాలని కోరుకుందాం. పేదల ఆకలి తరగడానికి తన జీవితాన్ని ధారపోసిన స్వామినాథన్ వ్యక్తిత్వం విలక్షణం, మేధస్సు నిరుపమానం. స్వామినాథన్ కృషితో నాటి ఆహార అభద్రత ఆకలి భారతం, నేడు మిగులు ధాన్యాలను పండించగల స్థాయికి ఎదగడం సుసాధ్యమయ్యిందని తెలుసుకోవాలి. ఆకలి చావులను తరిమే దివ్య ఔషధాన్ని అందించిన స్వామినాథన్ లేని లోటు పూడ్చలేనిదనడంలో అతిశయోక్తి లేదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# పశ్చిమ బంగాల్‌లోని కోల్‌కాతాలో 15,400 కోట్ల రూపాయల విలువైన అనేక కనెక్టివిటీ ప్రాజెక్టుల ను ప్రారంభించడం తో పాటు శంకుస్థాపన

న్యూఢిల్లీ, మార్చి 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కోల్‌కాతా లో అనేక కనెక్టివిటీ ప్రాజెక్టుల ను ఈ రోజు న ప్రారంభించడం తో పాటు శంకుస్థాపన కూడా జరిపారు. ఈ ప్రాజెక్టు ల విలువ 15,400 కోట్ల రూపాయలు ఉంది. పట్టణ ప్రాంతాల లో మొబిలిటీ సెక్టర్ లో చేపట్టిన ఈ అభివృద్ధి ప్రధాన ప్రాజెక్టు లు మెట్రో రైల్ మరియు రీజనల్ రేపిడ్ ట్రాన్‌జిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టిఎస్) లకు చెందినవి.

ప్రధాన మంత్రి మెట్రో ప్రాజెక్టు లు అన్నింటిని సింహావలోకం చేశారు; అంతేకాకుండా, కోల్‌కాతా లో భారతదేశం లో కెల్లా మొట్టమొదటి అండర్ వాటర్ మెట్రో అయినటువంటి ఎస్‌ప్లేనేడ్ - హావ్‌డా మైదాన్ మెట్రో మార్గం లో ఒక మెట్రో రైలు లో ఆయన ప్రయాణించారు కూడాను. ఆయన తన మెట్రో రైలు ప్రయాణం సందర్భం లో శ్రమికుల తో మరియు బడిపిల్లల తో సైతం మాట్లాడారు.

"ఈ ప్రాజెక్టు లో పని చేసిన వారి తోను మరియు యువజనుల తోను కలసి చేసిన మెట్రో యాత్ర పుణ్యవూని ఈ అనుభూతి స్మరణీయమైంది గా మిగిలిపోయింది. మేం హుగ్ లీ నది అడుగు న గల సొరంగ మార్గం గుండా కూడాను పయనించాం."

"కోల్ కాతా నగరం లో మెట్రో నెట్ వర్క్ గణనీయం గా వ?ద్ధి చెందిన కారణం గా ఈ రోజు న కోల్‌కాతా ప్రజల కు అత్యంత విశిష్టమైనటువంటి రోజు అవుతుంది. సంధానాని కి దన్ను లభించనుంది, మరి రాకపోకల లో రద్దీ ఇక మీదట తగ్గుతుంది. మన దేశం లో ఏదైనా ఒక ప్రధాన నది అడుగు భాగాన అండర్ వాటర్ మెట్రో ట్రాన్స్ పోర్టేశన్ టనల్ ను కలిగివున్నటువంటి మొట్టమొదటి మార్గం గా హావ్‌డా మైదాన్ -ఎస్‌ప్లేనేడ్ మెట్రో సెక్శన్ గుర్తింపు ను తెచ్చుకోవడం ఒక గర్వించదగినటువంటి క్షణం అని చెప్పాలి."

"కోల్‌కాతా మెట్రో ద్వారా కొన్ని స్మరణీయమైనటువంటి క్షణాలు ఆవిష్కృతం అయ్యాయి. జనశక్తి కి నేను ప్రణామాన్ని ఆచరించడం తో పాటు గా వారికి రెట్టించిన ఉత్సాహం తో సేవల ను అందిస్తూనే ఉంటాను." అని పేర్కొన్నారు.

పట్టణ ప్రాంతం లో రాకపోకల ను సులభతరం చేయడం కోసం క్రొత్త మార్గాల ను పెంచడం పట్ల శ్రద్ధ తీసుకోవడానికై ప్రధాన మంత్రి కోల్ కాతా మెట్రో లో హావ్ డా మైదానం-ఎస్ ప్లేనేడ్ సెక్శను, కవి సుభాష్-హేమంత్ ముఖోపాధ్యాయ్ మెట్రో సెక్శను, తారాతలా-మాజెరహాట్ మెట్రో సెక్శను (జోకా-ఎస్ ప్లేనేడ్ మార్గంలో ఓ భాగం), రూబీ హాల్ క్లినిక్ నుండి రామ్ వాడీ సెక్శను వరకు పుణె మెట్రో, ఎస్ఎన్ జంక్శన్ మెట్రో స్టేశన్ నుండి త్రిపునిథుర మెట్రో స్టేశన్ వరకు కోచి మెట్రో రైల్ ఒకటో దశ విస్తరణ ప్రాజెక్టు (ఐబి దశ), తాజ్ ఈస్ట్ గేట్ నుండి మనకామేశ్వర్ వరకు ఆగ్ రా మెట్రో యొక్క విస్తరణ, దిల్లీ-మేరఠ్ ఆర్ఆర్ టిఎస్ కారిడర్ లోని దుహాయి-మోదీనగర్ (ఉత్తర) సెక్శను లను ప్రారంభించారు. ఈ సెక్శనుల లో రైలు సర్వీసుల కు ఆయన ప్రాపరంభ సూచక ఆకుపచ్చటి జెండా ను చూపెట్టారు. పింప్ రీ చించ్ వడ్ మెట్రో-నిగ్ డీ మధ్య పుణె మెట్రో రైల్ ప్రాజెక్టు ఒకటోదశ విస్తరణ పనులకు కూడాను ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు.

రహదారి మార్గం లో రాకపోకల పరం గా రద్దీ ని తగ్గించడం లో , అంతరాయం లేనటువంటి, సులభం మరియు సౌకర్యవంతం అయినటువంటి కనెక్టివిటీ ని అందించడం లో ఈ విభాగాలు సహాయపడతాయి. కోల్ కాతా మెట్రో లో హావ్ డా మైదానం-ఎస్ ప్లేనేడ్ సెక్శను భారతదేశంలో ఏదైనా ఒక శక్తిశాలి నది క్రింది ప్రప్రథమ రవాణా సొరంగ మార్గం గా రూపు ను దిద్దుకొన్నది కావడం విశేషం. హావ్ డా మెట్రో స్టేశను భారతదేశంలో అన్నింటి కంటే లోతైనటువంటి మెట్రో స్టేశను అని చెప్పాలి. దీనికి అదనం గా, ఈ రోజు న ప్రారంభం అయినటువంటి తారాతలా - మాజెర్ హాట్ మెట్రో సెక్శను లో మాజెర్ హాట్ మెట్రో స్టేశన్ రైల్ వే లైనులు , ప్లాట్ ఫార్మ్ లు మరియు కాలువ ను ఆనుకొని ఉన్న ఒక అద్వితీయమైనటువంటి ఎత్తయిన మెట్రో స్టేశన్ గా ఉంది. ఈ రోజు న ప్రారంభించినటువంటి ఆగ్ రా మెట్రో లో ని సెక్శను చరిత్రాత్మక పర్యటన ప్రాంతాల కు కనెక్టివిటీ ని పెంచనుంది. ఆర్ఆర్ టిఎస్ సెక్శను ఎన్సీఆర్ లో ఆర్థిక కార్యకలాపాల కు ప్రోత్సాహాన్ని అందించగలదు.

# ముద్రగడతో ఎంపీ మిథున్ రెడ్డి భేటీ.. వైసీపీలోకి రావాలని ఆహ్వానం..

కాకినాడ, మార్చి 7: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం నివాసానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

అనంతరం ముద్రగడ నివాసంలోనే ఆయనతో మిథున్ రెడ్డి, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, పెద్దాపురం ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, జగ్గంపేట ఇన్‌ఛార్జ్ తోట నరసింహం భేటీ అయ్యారు.

అనంతరం మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముద్రగడను కలిశాం. ఈ సందర్భంగా ముద్రగడను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించాం. త్వరలోనే ముద్రగడ మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. కాపు రిజర్వేషన్ల కోసం గొప్ప ఉద్యమం చేసిన నేత ముద్రగడ. ఆఫర్ల కోసం పార్టీలో చేరే వ్యక్తి కాదు. స్వతహాగా ఆయనే పార్టీలో చేరుతారు. సీఎం జగన్‌కు పెద్దలను ఎలా గౌరవించాలో తెలుసు. ముద్రగడకు సముచిత స్థానం ఇస్తారు' అని అన్నారు.

# హోదా కోసం ఉద్యమిద్దాం.. కదిలిరండి - షర్మిల పిలుపు




అమరావతి, మార్చి 7:పదేళ్ల తర్వాతకూడా ప్రత్యేక హోదా ఊసే లేదు, హోదా అంటే ఏంటో అని వింతగా చూస్తున్నారు, అందుకే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుందని ఏపీ పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గత 10 ఏళ్లలో ఏ ఒక్కరూ ప్రత్యేక హోదా కోసం పోరాడింది లేదు. ఉవ్వెత్తున ఉద్యమించకుంటే ప్రత్యేక హోదా రాదు, ఈ బాధ్యతను కాంగ్రెస్ పార్టీ భుజానికి ఎత్తుకుందని వివరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో కాంగ్రెస్ న్యాయ ప్రతిజ్ఞ సభలో గురువారం షర్మిల మాట్లాడారు. ప్రత్యేక హోదా .. ఆంధ్రుల హక్కుఅని.. హోదా విషయంలో మనం 10 ఏళ్లు గొర్రెలయ్యామని అన్నారు. మనల్ని బలి ఇచ్చారని, తొలి 5 ఏళ్లు చంద్రబాబు, జగన్ మరో 5 ఏళ్లు గొర్రెల్ని చేశారని, ఇప్పుడు మనం గొర్రెలం కాదు సింహాలం అన్నారు. సింహాల లెక్కన పోరాటం చేయక పోతే హోదా రాదన్నారు. మంచితనంతో మౌనంగ ఉంటే మనకు హోదా ఇచ్చారా.. . మంచితనంగా ఉంటే పోలవరం కట్టారా.. ఆంధ్రులను మోసం చేసిన మోడీ ఒక డి ఫాల్టర్ అని మండిపడ్డారు. మోడీ ఒక కేడీ అని షర్మిల తీవ్ర పదజాలంతో విమర్శించారు.

అభివృద్ధిలో ఎక్కడో ఉండే వాళ్ళం.. చంద్రబాబుకి రాష్ట్ర అభివృద్ధి పట్టలేదు. రక్తం పంచుకు పుట్టిన జగన్ అన్నకి అభివృద్ధి ధ్యాస లేదు, మాట ఇచ్చి మడతపెట్టిన ఘనత జగన్ ది అని షర్మిల విమర్శించారు. జలయజ్ఞం కింద వైఎస్ఆర్ కట్టిన ప్రాజెక్ట్ లకి దిక్కులేదు, అని తూర్పారబట్టారు. హోదా రాకపోతే మన బిడ్డలకు ఉద్యోగాలు రావు, మన రాష్ట్రానికి భవిష్యత్ లేనే లేదు, ప్రత్యేక హోదా మనకు ఊపిరి అన్నారు. ఊపిరి లేకుండా బ్రతక గలమా .. రాష్ట్రమంతా కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

### బాబు, పవన్, జగన్‌పై షర్మిల బాణాలు

ప్రజలను ప్రత్యేక హోదా నుంచి పక్క దారి పట్టించారు. బీజేపీ కి రాష్ట్రంలో ఒక్క ఎంపీ లేదు, ఒక్క ఎమ్మెల్యే లేదు.. అయినా రాష్ట్రంలో బీజేపీ రాజ్యమేలుతోందని షర్మిల విమర్శించారు. బాబు,జగన్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. బాబు అధికారంలో ఉంటే బీజేపీ ఉనట్లే.. జగన్ ఉన్నా బీజేపీ ఉన్నటేనని, 10 ఏళ్లు దాటిన మనకు రాజధాని లేదన్నారు. హైదరాబాద్ 10ఏళ్లు ఇస్తే అవసరం లేదని ఉరుక్కుంటూ వచ్చారు. ఇక్కడ ఒకటి లేదు, మూడు లేదు. ఇది మన రాష్ట్రానికి సిగ్గు చేటని షర్మిల ఆవేశంగా విమర్శించారు.

# కొత్త మార్కెట్‌లకు వ్యవసాయ ఎగుమతులను సులభతరం చేస్తోన్న అపెడ..తాజా పండ్లు, కూరగాయలు, శ్రీ అన్నపై దృష్టి పెట్టింది

న్యూఢిల్లీ, మార్చి 7:అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడ) భారతదేశం నుండి వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. అందులో భాగంగా కొన్ని ఉత్పత్తులపై మాత్రమే ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు విలువ గొలుసును పెంచడానికి తాజా పండ్లు, కూరగాయలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు మరియు జంతు ఉత్పత్తుల వంటి ప్రాధాన్యత ఉత్పత్తులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఐరోపా, లాటిన్ అమెరికా మరియు ఆసియా వంటి కీలక మార్కెట్‌లలోకి విస్తరించడంపై దృష్టి సారించిన అపెడ తన ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి ప్రపంచ సూపర్ మార్కెట్‌లతో చిన్న భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా పరిశోధనా సంస్థల సహకారంతో సముద్ర ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయడం ద్వారా లాజిస్టికల్ ఖర్చులను తగ్గించేందుకు సంస్థ కృషి చేస్తోంది. ఈ వ్యూహాత్మక కార్యక్రమాలు పోటీతత్వాన్ని పెంపొందించడం మరియు స్థిరమైన వృద్ధిని నడపడం ద్వారా భారతదేశ వ్యవసాయ ఎగుమతులను పెంచడానికి అపెడ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

శ్రీ అన్న అంటే మిల్లెట్స్‌ను ప్రోత్సహించడానికి అపెడ సమిష్టి ప్రయత్నాలు ఆరోగ్యకరమైన మరియు మరింత వైవిధ్యభరితమైన ఆహార ఉత్పత్తులను పెంపొందించాలనే ప్రభుత్వ దృష్టితో ప్రతిధ్వనిస్తున్నాయి. గత సంవత్సరంలో అంతర్జాతీయ మిల్లెట్స్-2023 సంవత్సరంలో ప్రత్యేక దృష్టి సారించిన అపెడ శ్రీ అన్నా బ్రాండ్ క్రింద విస్తృత శ్రేణి విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి మరియు ఏకీకరణ కోసం కృషి చేసింది.

ఈ వ్యూహాత్మక ఆలోచన పాస్తా, నూడుల్స్, అల్పాహార తృణధాన్యాలు, ఐస్ క్రీం, బిస్కెట్లు, ఎనర్జీ బార్‌లు మరియు స్నాక్స్‌తో సహా వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులను రూపొందించడానికి మరియు ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి దారితీసింది. శ్రీ అన్నా ఉత్పత్తి శ్రేణిని వైవిధ్యపరచడం ద్వారా అపెడా కేవలం ఆవిష్కరణలను ప్రేరేపించడమే కాకుండా ఆ ఉత్పత్తులను ఎగుమతి విలువ గొలుసుకు సజావుగా అనుసంధానించింది. ఈ ప్రయత్నాల ద్వారా అపెడ శ్రీ అన్న మిల్లెట్స్ ప్రొఫైల్‌ను ఎలివేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. తద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలను ప్రోత్సహించడం మరియు భారతదేశ వ్యవసాయ ఎగుమతి పోర్ట్‌ఫోలియో విస్తరణను సులభతరం చేయడం వంటి ప్రభుత్వ విస్తృతమైన ఎజెండాకు దోహదం చేస్తుంది.

2023లోని ఏప్రిల్-నవంబర్ నెలల్లో ఇరాక్, వియత్నాం, సౌదీ అరేబియా మరియు యూకే వంటి ప్రధాన మార్కెట్‌లకు ఎగుమతులను అపెడ సులభతరం చేసింది. మునుపటి సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన వృద్ధిని సాధించింది. వృద్ధి వరుసగా 110%, 46%, 18% మరియు 47% పెరగడం ఈ అద్భుతమైన విస్తరణ కీలక మార్కెట్లలో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రపంచ డిమాండ్‌ను నొక్కి చెబుతుంది.

ఉత్పత్తుల చేరికను పెంపొందించే లక్ష్యంలో భాగంగా అపెడ స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు మరియు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పిఓలు/ఎఫ్‌పిసిలు) గ్లోబల్ ఈవెంట్‌లలో వారి భాగస్వామ్యాన్ని ప్రారంభించడం ద్వారా వారికి మద్దతునిస్తోంది.

ఎగుమతిదారుల నుండి ఫీడ్‌బ్యాక్‌కు ప్రతిస్పందనగా అపెడ టర్కీ, దక్షిణ కొరియా, కెన్యా, దక్షిణాఫ్రికా మరియు జపాన్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో కొత్త ఫెయిర్‌లలో స్టాల్లా నే ప్రారంభానికి నాయకత్వం వహిస్తోంది. ఈ చురుకైన విధానం భారతీయ ఎగుమతిదారులకు ఎక్కువ మార్కెట్ యాక్సెస్‌ను సులభతరం చేయడం మరియు స్థిరమైన వృద్ధి అవకాశాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

# నీళ్లు ఇవ్వకుండా ప్రాజెక్ట్ కు ప్రారంభోత్సవమా... జగన్ పై టిడిపి నేతలు ఫైర్

అమరావతి, మార్చి 7: అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టు, కాలువలు పూర్తయిందంటూ జాతికి అంకితం చేస్తూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు టిడిపి నేతలు.. వెలిగొండ ప్రాజెక్ట్ లో నీటి బిందెలతో నీటిని పోస్తూ నేడు నిరసన తెలిపారు.. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైపాలెం టిడిపి ఇన్ఛార్జి జి.ఎరిక్షన్ బాబుల ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు భారీ సంఖ్యతో కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబులు మాట్లాడుతూ 10వేల మంది నిర్వాసితులను రోడ్డున పడేసి వారి దిబ్బపై జగన్ ఫైలాన్ ఆవిష్కరించారని మండిపడ్డారు.. పశ్చిమ ప్రాంత ప్రజలు, రైతుల ఓట్లు దండుకోవడం కోసమే జగన్నాటకం ఆడుతున్నారని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే నీళ్లు ఇవ్వకుండా ఎలా పూర్తయింది అంటారని నిలదీశారు.

వైసిపి నాయకులు అందరూ కలిసి బిందెలతో నీళ్లు తెచ్చి ప్రాజెక్టులో నీరు నింపుతారా అంటూ ప్రశ్నించారు? ఎప్పటికైనా తెలుగుదేశం పార్టీతోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. వైసిపి మాయమాటలు నమ్మి పరిస్థితిలో ప్రజలు లేరని, వచ్చే ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యేలను చిత్తుచిత్తుగా ఓడించి జగన్ నాటకానికి తెర దింపుతారని హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మార్కాపురం నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గేమింగ్‌గా మభ్యపెడుతూ సాగే బెట్టింగ్, జూదం ఆమోదాలపై కఠినమైన చర్యలు

న్యూఢిల్లీ, మార్చి 7:బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రకటనలు పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) ఒక సమగ్ర సలహా (అడ్వైజరీ) జారీ చేసింది. సలహా, వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం, వివిధ చట్టాల ప్రకారం నిషేధించబడిన చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, ప్రచారం, ఆమోదం నిషేధాన్ని స్పష్టం చేస్తుంది. దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రాంతాలు బెట్టింగ్, జూదం పబ్లిక్ గ్యాంబ్లింగ్ చట్టం, 1867 ప్రకారం ఖచ్చితంగా నిషేధించారు. చట్టవిరుద్ధంగా పరిగణిస్తారు. అయినప్పటికీ, ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, యాప్‌లు నేరుగా బెట్టింగ్, జూదం, అలాగే గేమింగ్ ముసుగులో ప్రకటనలు చేస్తూనే ఉన్నాయి. ఇటువంటి కార్యకలాపాల ఆమోదాలు ముఖ్యంగా యువతకు ఎక్కువగా ఆర్థిక,సామాజిక-ఆర్థిక చిక్కులలో పడేస్తున్నాయి.

బెట్టింగ్, జూదం ప్లాట్‌ఫారమ్‌లను ప్రచారం చేయకుండా వారిని హెచ్చరిస్తూ, మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు వివిధ సలహాలను జారీ చేయడంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయత్నాలను ఈ సలహా స్పష్టంగా వివరిస్తుంది. ఆన్‌లైన్ ప్రకటనల మధ్యవర్తులు భారతీయ ప్రేక్షకులను ఉద్దేశించి ఇటువంటి ప్రకటనలను లక్ష్యంగా చేసుకోకుండా ఉండేలా తగు హెచ్చరికలు కూడా చేశారు.తప్పుదోవ పట్టించే ప్రకటనల నివారణకు, తప్పుదోవ పట్టించే ప్రకటనల కోసం ఎండార్స్‌మెంట్లు, 2022కు మార్గదర్శకాలు ప్రస్తుత చట్టంలో నిషేధించిన ఉత్పత్తులు లేదా సేవల ప్రకటనలను నిర్దిష్టంగా నిషేధిస్తున్నట్లు సలహా ప్రముఖంగా వివరించింది.ఉపయోగించిన మాధ్యమంతో సంబంధం లేకుండా అన్ని ప్రకటనలకు మార్గదర్శకాలు వర్తిస్తాయని పునరుద్ఘాటించింది. చట్టవిరుద్ధమైన స్థితిని బట్టి ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌ల ప్రచారం లేదా ప్రకటనలో పాల్గొనే సెలబ్రిటీలుశీలురును చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొన్న సమాన బాధ్యత కలిగి వుంటారని సీసీపీఏ హెచ్చరించింది. ఈ సలహా ద్వారా, బెట్టింగ్ లేదా జూదానికి పరిమితం కాకుండా చట్టం ద్వారా నిషేధించబడిన ఏదైనా ప్రకటన లేదా కార్యకలాపాల ఆమోదం కఠినమైన పరిశీలనకు లోబడి ఉంటుందని సీసీపీఏ హెచ్చరించింది. మార్గదర్శకాల ఉల్లంఘన జరిగినట్టు తెలిస్తే, తయారీదారులు, ప్రకటనదారులు, ప్రచురణకర్తలు, మధ్యవర్తులు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఎండార్స్‌లు (సమ్మతి ఇచ్చిన వారు), ఇతర సంబంధిత వాటాదారులతో సహా, వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం, కఠినమైన చర్యలు చేపడతారు.

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ, ఈ మార్గదర్శకాలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని, భారతీయ చట్టం ప్రకారం చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను ప్రోత్సహించడం లేదా ఆమోదించడం మానుకోవాలని అన్ని వాటాదారులను కోరింది.

# క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి

భద్రాద్రి కొత్తగూడెంమార్చి 7: క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురైన ఓ యువకుడు మృతి చెందిన విషాదకర సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో గురువారం చోటు చేసుకుంది. గౌతంపూర్ మిలీనియం కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు పొనగంటి అంకుష్‌కు ఇద్దరు కొడుకులు.

పెద్ద కొడుకు యశ్వంత్(33)కు క్రికెట్ అంటే మక్కువ. ఈ క్రమంలో రోజు మాదిరిగానే క్రికెట్ ఆడేందుకు స్టేడియంకు వెళ్లాడు. క్రికెట్ ఆడుతున్న సమయంలో ఒంట్లో కాస్త నలతగా ఉన్నదని తోటి క్రీడాకారులకు చెప్పి బయటకు వచ్చి చెట్టు నీడన కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

ఆహ్వానం
2023 ఫీచర సునీతా రావు తృతీయ వార్షిక స్మారక సాహిత్య పురస్కార ప్రధానోత్సవం
తేది : 10-03-2024 ఆదివారం ఉ॥10.30 నిII॥కు
వేదిక : రవీంద్ర భారతి పైడి జయరాజ్ హాల్ రెండవ ఫ్లోర్
సభాధ్యక్షులు: సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త
ముఖ్య అతిథి: నందిని సిధారెడ్డి, సాహిత్య అకాడమీ తొలి చైర్మన్
ప్రత్యేక అతిథులు :
అమ్మంగి వేణుగోపాల్, ప్రభుత్వ తొలి కాళోజి అవార్డు గ్రహీత
మామిడి హరికృష్ణ, తెలంగాణ ప్రభుత్వ కల్చరల్ డైరెక్టర్
కాసుల ప్రతాపరెడ్డి, ప్రముఖ విమర్శకులు, కథకులు
కెపి అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు, కథకులు
విహారి, ప్రముఖ సాహితీవేత్త
వేముగంటి మురళీకృష్ణ, ప్రముఖ కవి కమిటీ సలహాదారులు
పి రవీందర్రావు, ఇంజనీర్ చీఫ్ భవనాలు రహదారులు
పురస్కార గ్రహీతలు
కవిత్వం, గజ్జల రామకృష్ణ దీపం ఉండగానే
కథ, చింతకింది శ్రీనివాస్ ఉడుకు బెల్లం
విమర్శ, ఆడెపు లక్ష్మీపతి దిక్ చక్రం, లక్ష్మణ చక్రవర్తి షట్ చక్రం,
అభినందనలతో
పి. శ్రీనివాసరావు, జె. గౌతమ్ రావు, పి. అమరేందర్ రావు, పి. వెంకట నరసింహారావు, టి మన్మోహన్ రావు, జె బాలచందర్, పి నాగేందర్ రావు, రాజ మహేందర్ రెడ్డి వెంకటరమణ.
కార్యక్రమం అనంతరం భోజనం - అందరూ ఆహ్వానితులే
కాంచనపల్లి గోవర్ధన్ రాజు, పురస్కార కమిటీ కన్వీనర్
పి విజయేందర్ రావు, ఫీచర సునీతారావు ఫౌండేషన్ చైర్మన్.

# లక్షద్వీప్ దీవుల్లో భారత నౌకాదళం వ్యూహాత్మక స్థావరం ఏర్పాటు

## – 'ఐఎన్ఎస్ జటాయువు' నేవీ బేస్ ప్రారంభం



న్యూఢిల్లీ మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారత నౌకాదళం లక్షద్వీప్ దీవుల్లో వ్యూహాత్మక స్థావరాన్ని ఏర్పాటు చేసింది. 'ఐఎన్ఎస్ జటాయువు' నేవీ బేస్‌ను బుధవారం ప్రారంభించింది. లక్షద్వీప్‌లోని మినికాయ్‌లో ఏర్పాటు చేసిన రెండో నేవల్ బేస్ 'ఐఎన్ఎస్ జటాయువు'ను నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరి కుమార్ ప్రారంభించారు. లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ పటేల్, సదరన్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ వీ శ్రీనివాస్, వెస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ జే సింగ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామాయణ ఇతిహాసానికి సంబంధించిన జటాయువు పేరు కొత్త నేవీ స్థావరానికి పెట్టినట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరి కుమార్ తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో కార్యాచరణ సామర్థ్యాన్ని ఇది చాటుతుందని అన్నారు. కాగా, లక్షద్వీప్ దీవుల్లోని కవరత్తిలో ఇప్పటికే ఐఎన్ఎస్ ద్వీపరక్షక్ పేరుతో నేవల్ బేస్ ఉంది. కొత్తగా ప్రారంభించిన 'ఐఎన్ఎస్ జటాయువు' రెండో నేవల్ బేస్. కొచ్చికి నైరుతి దిశలో 215 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న లక్షద్వీప్ దక్షిణ ద్వీపం మినికాయ్‌లో దీనిని ఏర్పాటు చేశారు. ఐఎన్ఎస్ జటాయువు కమాండెంట్‌గా నేవీ కమాండర్ వ్రత్ బాఘేల్ వ్యవహరించనున్నారు.

# ఉన్నఫలంగా ఢిల్లీ వెళ్లిన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి

## –చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు టెన్షన్

అమరావతి మార్చ్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ–జనసేనతో బీజేపీ పొత్తు ఉంటుందా? లేదా? దీనిపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. పొత్తు ఉంటుందని ఒకవైపు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెబుతుంటే బీజేపీ రాష్ట్ర నేతలు మాత్రం తమ నిర్ణయాన్ని ఎటూ తేల్చడం లేదు. పొత్తులపై నిర్ణయాన్ని నానుస్తూనే.. ఒంటరిగా బరిలోకి దిగితే రిజల్ట్ ఎలా ఉండబోతుందనే దానిపై కూడా తర్జనభర్జనలు పడుతోంది. ఇలాంటి సమయంలో బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఉన్నఫలంగా ఢిల్లీ వెళ్లడం ఇప్పుడు సంచలనంగా మారింది. నిజానికి దగ్గుబాటి పురంధేశ్వరి ఇవాళ నంద్యాల పర్యటనకు వెళ్లాల్సి ఉంది. నంద్యాలకు చెందిన బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ ఇన్‌ఛార్జి భూమా కిశోర్ రెడ్డి ఇటీవల బీజేపీకి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లి పరిస్థితులను సెట్ చేయాలని అనుకున్నారు. కానీ అకస్మాత్తుగా అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో చివరి నిమిషంలో నంద్యాల పర్యటనను రద్దు చేసుకుని ఢిల్లీ వెళ్లారు. ఏపీ ఎన్నికల సన్నద్ధతతో పాటు, అభ్యర్థుల ఖరారుపై బీజేపీ హైకమాండ్‌తో చర్చించేందుకు పురంధేశ్వరి ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది. బీజేపీతో పొత్తు కొనసాగు తుందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మొదట్నుంచి చెబుతున్నారు. కానీ బీజేపీ మాత్రం పొత్తులపై తమ నిర్ణయాన్ని ఇంకా వెల్లడించలేదు. అధిష్ఠానానికే ఆ నిర్ణయాన్ని వదిలేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల బీజేపీ రాష్ట్ర నాయకత్వం.. అన్ని జిల్లాల ముఖ్య నేతలతో సమావేశమైంది. పార్టీ బలాబలాలతో పాటు.. వచ్చే ఎన్నికల బరిలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై చర్చించింది. వీటి ఆధారంగా ఓ నివేదికను రూపొందించి అధిష్ఠానానికి సమర్పించారు. ఇదిలా ఉంటే.. త్వరలోనే బీజేపీ రెండో విడత ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా అభ్యర్థులు ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో సొంతంగా పోటీ చేయాలా? పొత్తు పెట్టుకోవాలా? అనే అంశంపై చర్చించేందుకు పురంధేశ్వరిని ఢిల్లీ పిలిపించినట్లు తెలుస్తోంది. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఢిల్లీ వెళ్లడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లో టెన్షన్ మొదలయ్యింది. పొత్తులపై బీజేపీ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కళ్యాణ్.. రెండో విడత అభ్యర్థుల జాబితాతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోపై చర్చించారని సమాచారం.

# 11న ఐదవ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం

**–తొలి విడతగా ఈ సంవత్సరం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల మంజూరు**

**–ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం**

**–మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్ మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశాం. ఈ నెల 11న భద్రాచలం రాములోని సన్నిధిలో ఐదవ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించడానికి అవసరమైన కార్యచరణను ప్రారంభించిందన్నారు.

బుధవారం సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేయనున్నామని, 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలని, హాలు, బెడ్ రూమ్ తో పాటు వంటగది, బాత్ రూమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల పేరుపైన ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారుల ఎంపిక చేస్తారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంభందించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు.

# భవన నిర్మాణాల్లో వాననీటి వ్యవస్థలకు తిలోధకాలు

**–నగరంలో పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న నిర్మాణాలు**

**– పచ్చదనానికి చోటివ్వని వైనాలు .**

**– పరిమితికి మించిన అనుమతి అంతస్తులు**

**– మౌలిక సదుపాయాలపై ఒత్తిడి – మురుగు నీరు రోడ్లపైకి.**

హైదరాబాద్ మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నిబంధనల మేర వాన నీటి సంరక్షణ, పచ్చదనానికి చోటు కల్పించాల్సిన భవన నిర్మాణదారులు మహానగరంలో దారుణంగా తిలోధకాలు ఇస్తున్నారని, దానివల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవైపు భూగర్భ జాలాలను అపరిమితంగా తోడటం, మరోవైపు సిమెంట్ రోడ్ల నిర్మాణాల మూలంగా భూగర్భ జలాలు పాతాలానికి చేరుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో భూగర్భ జలాన్ని తిరిగి నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని. ....కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్పీహెచ్ రంగయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ. .. నగరంతోపాటు గ్రేటర్ పరిధిలో అనేక భవనాల్లో నిబంధనలు భేఖాతారు జరుగుతోందన్నారు. భారీ భవనాల్లో ఎక్కడా సరిపడ వాననీటి పిట్ ల జాడలు లేవన్నారు. అంతేగాక 10శాతం ఉండాల్సిన పచ్చదనం కంటితుడుపుగా ఉంటుందని ఆరోపించారు. నిబంధనలు అతిక్రమిస్తున్నా స్థానిక నాయకుల ఒత్తిళ్లతో క్షేత్రస్థాయి అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెంట్ హౌస్ లాంటి అక్రమ అంతస్థుల మూలంగా మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరిగి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ పర్యావరణానికి మరోరకమైన సమస్య సృష్టిస్తోందన్నారు. ఇప్పటివరకు జరిగిన అన్ని భవన నిర్మాణాలపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నిబంధనలు పాటించని వ్యక్తులు, నిర్మాణ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు నిర్మాణాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ అతిక్రమణలు, ఆక్రమణలు జరగకుండా తొలిదశ లోనే అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అధికారులే నిర్మాణదారులకు ఉచిత సలహాలు ఇస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయని మండిపడ్డారు. మరోవైపు గ్రీన్ బిల్డింగ్ ల నిర్మాణాలకు చొరవ తీసుకోవాలని రంగయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలి

## – సీఎం రేవంత్ రెడ్డిని కోరిన కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్



ఖమ్మం, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ ఖండించారు. కొనిజర్ల మండల కేంద్రంలో గురువారం ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడు తూ... ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇప్పటికే బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల్లో చాలామంది కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నారన్న సంగతి తెలు సుకొని, వారు పార్టీ నుంచి వెళ్లిపోతా రనే భయంతోనే, నిస్సహాయ పరిస్థితు ల్లోనే కేసీఆర్ పైపైకి బీరాలు పలుకు తున్నాడని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ంలో ప్రజాతీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ మరిచిపోతే ఎలాఅన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి మెజారిటీతో ఏర్పాటై, ప్రజారంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు,వేతనాలు వెంటనే ఇవ్వాలి

**– మధిర ఎంఈఓకి వినతి పత్రం**

**– ఈనెల 11న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి**

**– సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు**

ఖమ్మం, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు,వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎంఈఓకి వినతిపత్రం




అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ...మధిర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వంట వండి వడ్డిస్తున్న కార్మికులకు బిల్లులు, పెండింగ్ గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని, పాఠశాలలో వంటకు అవసరమైన అన్ని సరుకులు,వంట పాత్రలు,మౌలిక సౌకర్యాలు వెంటనే ఇవ్వాలని ఈనెల 11వ తేదిన ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిని నిర్వహిస్తున్నా మని కావున ఈ ధర్నా కార్యక్రమాన్ని మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చే యవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిఐటియు మధిర టౌన్ కన్వీనర్ పడకండి మురళి, మండల కన్వీనర్ వడ్రానపు మధు, మధ్యాహ్న భోజన కార్మికులు కృష్ణకుమారి, చిన్ని, రమాదేవి, ఫర్జానా బేగం పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నేత

## – ఓబిసి జిల్లా సెక్రెటరీ బమ్మిడి శ్రీనివాస్



ఖమ్మం, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి): హైదరాబాదులోని మంత్రి నివాసములో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు, వారి తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ని కాంగ్రెస్ నేత, ఓబీసీ ఖమ్మం జిల్లా సెక్రెటరీ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి ఖమ్మం నగరంలోని పలు అభివృద్ధి సమస్యలపై చర్చించారు.

# విశాఖ ప్రజలను మోసం చేసేందుకే విశాఖ విజన్ పేరిట కొత్త నాటకం

## –పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల వ్యంగ్రస్త్రాలు

అమరావతి మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అతడి సోదరి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎక్స్ ట్విటర్ ద్వారా మరోసారి వ్యంగ్రస్త్రాలు సంధించారు. విశాఖ ప్రజలను మోసం చేసేందుకు విశాఖ విజన్ పేరిట కొత్త నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ విశాఖ విజన్ గళం ఎత్తుకుంటున్నాడని దుయ్యబట్టారు. పరిపాలనా రాజధానిలో ఇన్నాళ్లూ పాలనను ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. ఆంధ్రుల తలమానికమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తుంటే ప్రేక్షక పాత్ర వహించడం మీ విజనంటూ మండిపడ్డారు. రైల్వే జోన్ పట్టాలు ఎక్కకపోయినా మౌనం వహించడం మీకు ప్రాక్టికలని , ఐటీ హిల్స్ నుంచి దిగ్గజ కంపెనీలు వెళ్లిపోతున్నా.. చూస్తూ ఉండటం మీ రోడ్ మ్యాపని ఆరోపించారు. గుట్టల్ని కొట్టడం, పోర్టులను అమ్మడం, భూములను మింగడం.. ఇదే విశాఖపై వైసీపీ విజన్ అని పేర్కొన్నారు.

# రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో ఉప-ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్న ఇఎస్ఐసి

న్యూఢిల్లీ, మార్చి 7:ఉద్యోగుల రాష్ట్ర బీమా కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ 231వ సమావేశం న్యూఢిల్లీలో 05.03.2024న కార్మిక ఉ ఉపాధి కార్యదర్శి మిస్ సుమితా దావ్రా అధ్యక్షతన జరిగింది. సమావేశం సందర్భంగా బీమా చేసిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సంరక్షణ, నగదు ప్రయోజనాల లభ్యతను పెంపొందించే లక్ష్యంతో దిగువన పేర్కొన్న ముఖ్య నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఉప-ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అల్వార్, ఖైర్తాల్–తిజారా, కొత్‌పుట్లి– బెహరార్, భరత్‌పూర్, డీగ్ జిల్లాల్లో నివసిస్తున్న దాదాపు 12 లక్షల మంది బీమా పొందిన కార్మికుల, ఇఎస్ఐ పథకం లబ్ధిదారులు అల్వార్‌లో కొత్త ఇఎస్ఐసి ఉప- ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో ప్రయోజనం పొందుతారు. హారోహళ్ళి, నర్సాపుర, బొమ్మసాంద్ర (కర్ణాటక), మీరూట్, బరేలీ (ఉత్తరప్రదేశ్), పీతంపూర్ (మధ్యప్రదేశ్), దుబూరి (ఒడిశా)లలో మొత్తం అంచనా వ్యయం రూ. 1128.21 కోట్లతో 7 కొత్త ఇఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ అంచనాల ఆమోదంతో త్వరలో ఈ ఆసుపత్రుల నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఆసు పత్రులు ఇఎస్ఐసి ప్రస్తుత వైద్య సంరక్షణ మౌలిక సదుపాయాలకు 800 పడకలను జోడిస్తాయి. వైద్య, నగదు ప్రయోజనాల బట్వాడా మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి వికసిత్ భారత దార్శనికతకు అనుగుణంగా, ఈ ఆసుపత్రులు, కార్యాలయాల స్థాపనకు సంబంధించిన నిర్ణయాలను తీసుకున్నారు. గత పది సంవత్సరాలలో ఇఎస్ఐ పథకం కింద బీమా పొందిన కార్మికులు, జిల్లాల సంఖ్య విశేషంగా వృద్ధి చెంది, వాటి సంఖ్య వరుసగా 3.43 కోట్లు, 666గా పెరిగింది.

# బెంగళూరులో తీవ్రస్థాయికి చేరుకున్న తాగునీటి సంక్షోభం

**–మా ఇంట్లో బోరు కూడా ఎండిపోయింది..**

**–బెంగళూరు నీటి సంక్షోభంపై డీకే శివకుమార్**

బెంగళూరు మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సిలికాన్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరున్న కర్ణాటక రాజధాని బెంగళూరు లో తాగునీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో అపార్ట్ మెంట్స్, ఇళ్లలో ఉన్న బోర్లు ఎండిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీలకు పదిరోజులకొకసారి కూడా నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు నీటికోసం అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో తీవ్ర నీటి ఎద్దడిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ నీటి ఎద్దడి నెలకొందని, తన ఇంట్లోని బోరు కూడా ఎండిపోయిందని తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా సరే నగర ప్రజలకు నీరు అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేయకండి అంటూ ప్రజలకు సూచించారు. 'ప్రస్తుతం భయంకరమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాము. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా నగర ప్రజలకు నీరు సరఫరా చేస్తాము' అని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావులు ఎండిపోవడంతో బెంగళూరు నగరం తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోంది. ఈ నీటి సంక్షోభాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. అనేక ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు నీటి పంపిణీ కోసం నివాసితుల నుంచి విపరీతంగా ఛార్జ్ చేస్తున్నారు. ఈ అంశంపై కూడా డిప్యూటీ సీఎం మాట్లాడారు. నీటిని సరఫరా చేసేందుకు కొన్ని ప్రైవేటు ట్యాంకర్లు రూ. 600 ఛార్జ్ చేస్తుంటే.. మరికొన్ని రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ధరలను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ట్యాంకర్లు అన్నీ అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలని కోరినట్టు తెలిపారు. దూరాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తామని పేర్కొన్నారు. తీవ్రమైన నీటి ఎద్దడి నేపథ్యంలో పలు హౌసింగ్ సొసైటీలు నీటి వృధాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేస్తే భారీ జరిమానా తప్పదంటూ ఇప్పటికే పలు హౌసింగ్ సొసైటీలు తమ నివాసితులకు హెచ్చరికలు జారీచేశాయి.

# కాచిగూడ సి ఐ లక్ష్మి కాంత్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపిన శివసేన్

హైదరాబాద్ మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాచిగూడ సి ఐ గా కొత్తగా చార్జ్ తీసుకున్నారు లక్ష్మి కాంత్ రెడ్డిని శివసేన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ నేతృత్వం లో ప్రతినిధుల బృందం మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం శ్రీరాముని ప్రతిమను మరియు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ లక్ష్మి కాంత్ రెడ్డి మాట్లాడుతూ తన పోలీస్ లిమిట్స్ లో శాంతి భద్రతలను కాపాడదానికి తన శక్తి మేరకు కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు స్తానిక ప్రజలు కుడా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు.



# అడిషనల్ డీసీపీగా భాధ్యతలు స్వీకరించిన జి.ప్రసాద్ రావు



ఖమ్మం, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి): అడిషనల్ డీసీపీ లాడఆర్డర్ గా భాధ్యతలు స్వీకరించిన జి.ప్రసాద్ రావు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం జారీ బదిలీల నేపథ్యంలో రచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధి లోని ఎల్ బి నగర్ ఎస్ఓటి అడిషనల్ డీసీపీగా పనిచేసి ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం భాధ్యతలు స్వీకరించారు.

# నీటి సంక్షోభంలో విలవిలలాడుతోన్న బెంగళూర్ నగరం

బెంగళూర్ మార్చ్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బెంగళూర్ నగరంలోని పలు ప్రాంతాల్లో బోర్‌వెల్స్ ఎండిపోవడంతో మార్చిలోనే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నీటి సంక్షోభంలో నగరం విలవిలలాడుతోంది. నీటి కోసం పొడవాటి క్యూల్లో వేచిఉండాల్సి వస్తోందని ఆర్ఆర్ నగర్ వాసులు వాపోతున్నారు. స్థానికులు నీటి కోసం వాటర్ ట్యాంకర్లపై ఆధారపడటంతో అధిక ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదని చెబుతున్నారు. కొద్దిపాటి నీటితోనే ఇంట్లో వారంతా సర్దుకోవాల్సి వస్తోందని అంటున్నారు. స్నానం చేసేందుకు, వంట చేసుకునేందుకు కూడా తగినంత నీరు ఉండటం లేదని మహిళలు నీటి కష్టాలను ఏకరువు పెట్టారు. గత మూడు నెలలుగా నీటి కొరత వెంటాడుతోందని తాము నిత్యం బీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (బెంగళూర్ నీటి సరఫరా, సీవరేజ్ బోర్డ్) అధికారికి ఫోన్ చేస్తున్నా ఫలితం లేదని చెప్పారు. తాను ప్రతిరోజూ తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌కు వస్తున్నానని, ఇక్కడకు కేవలం ఒక వ్యక్తినే అనుమతిస్తున్నారని గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని వివరించారు. ప్రైవేట్ ట్యాంకర్లు గతంలో క్యాన్‌కు రూ. 600–రూ. 1000 వసూలు చేయగా ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ. 2000కుపైగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్లను ధర తగ్గించాలని ప్రభుత్వం కోరిన తర్వాత వారు తమ ప్రాంతానికి రావడం నిలిపివేశారని తెలిపారు.

# జయహో! "మహిళా" నీకు వందనం...



(మార్చి, 8వ తేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

## పరిచయం :

పితృస్వామ్య సమాజంలో యుగాల నుండి పురుషుని ఆధిక్యం విస్తృతంగా వ్యాపించింది, స్త్రీలు సమాజంలో కుటుంబం పట్ల భయపడేలా చేసింది, ఇది మహిళలు లక్ష్యం కోసం ఏదైనా నిర్ణయం తీసుకోవటానికి దూరం చేస్తుంది. ఈ విధంగా స్త్రీలు లింగం కారణంగా జీవితంలో ప్రతి దశలో ఆధిపత్యం చెలాయించ బడతారు. మహిళా సాధికారత వ్యక్తిగత, సామాజిక, రాజకీయ, ఆర్థిక అన్ని న్యాయ రంగాలలో మహిళలకు హక్కును ఇస్తోంది. లింగ సమానత్వం కొనసాగించబడాలి, ఇది దేశాన్ని ఉన్నత స్థాయి అభివృద్ధికి విజయానికి దారి తీస్తుంది. మన దేశంలో 50% కన్నా ఎక్కువ స్త్రీ జనాభా ఉంటున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో సమాజం యొక్క అభివృద్ధికి సాధ్యమైన విధంగా మహిళా సాధికారతను పొందడం చాలా ముఖ్యమైనది. స్త్రీలు పురుషులతో సమాన హక్కులతో పుడతారు. పురుషులు, మహిళలు మన సమాజాన్ని ఏర్పరుస్తారు. సమతుల్యతను కాపాడుకోవటానికి ఇద్దరూ బలంగా, సమర్థవంతంగా ఉండాలి. మహిళా సాధికారత కలిగిన స్త్రీలు ఎలాంటి సమస్యలకు బలైపోయే అవకాశం తక్కువ. వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు, వారు కోరుకున్న వృత్తిని కొనసాగిస్తారు. విద్య, ఆరోగ్యం యొక్క ప్రాథమిక మానవ హక్కులను కలిగి ఉంటారు. మహిళా సాధికారత అనేది తమను తాము నిర్ణయించే సామర్థ్యాన్ని కలిగి ఉండటానికి మహిళలను శక్తివంతులుగా తయారుచేస్తుంది. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలు, అనగా మహిళా సాధికారత లింగ సమానత్వాన్ని వేగవంతం చేయడానికి తగు చర్యలకు పిలుపునిచ్చేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ సెలవుదినం. మహిళా దినోత్సవం ఎందుకు, ఎలా మొదలైంది..? అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి వందేళ్లు దాటినా గొప్ప చరిత్ర ఉంది గతంలోకి వెళితే ...

## చరిత్ర :

1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లను అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. 1909 ఫిబ్రవరి 28న ఖూాలోని న్యూయార్క్ నగరంలో ఖూ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ ఈ రోజును ప్రతిపాదించారు. రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ. దీని ప్రాముఖ్యతను చూసి ముగ్ధులయిన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. 1910 సంవత్సరంలో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ యొక్క కోపెన్ హాగన్ సమావేశంలో మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ హోదా లభించింది. ఆ . సమయంలో మహిళలందరికీ ఓటు హక్కు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. అయితే, ఆ సమయంలో నిర్దిష్ట తేదీని నిర్వచించలేదు.

## తొలిసారిగా మహిళా దినోత్సవం..

మొట్టమొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1911 లో మార్చి 19 న డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో జరుపుకున్నారు, ముఖ్యంగా మహిళల హక్కుల గురించి పదిలక్షల మంది మద్దతు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సంస్థ జనరల్ అసెంబ్లీ మహిళల హక్కులు మరియు అంతర్జాతీయ శాంతి కోసం 1977 మార్చి 8న ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొట్టమొదటిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1913లో రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజును అధికారిక సెలవు రోజుగా ప్రకటించారు. 1917 లో ఫిబ్రవరి విప్లవం ఆ నెల చివరి ఆదివారం సెయింట్ పీటర్స్ బర్గ్లో మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మొదలయ్యింది. (గ్రెగేరియన్ కాలెండరు ప్రకారం ఆ తారీఖు మార్చి 8 ఆ రోజు మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలోని ఆహార కొరత ముగిసిపోవాలని నినదించారు. దీన్నే 'బ్రెడ్డు, శాంతి' డిమాండుగా వ్యవహరించారు. లియోన్ ట్రోస్కీ ప్రకారం, 'ఆ రోజే ఒక విప్లవానికి పునాదులు పడతాయని ఎవరూ ఊహించలేదు. వస్త్ర పరిశ్రమల్లోని మహిళా శ్రామికులందరూ అధికారులను ఖాతరు చేయకుండా విధులు బహిష్కరించి వీధుల్లో పడ్డారు. అవే విప్లవానికి తొలి అడుగులు మరోవైపు 1917 యుద్ధం వేళ రష్యాలోని మహిళలు ఆహారం-శాంతి కోసం డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా రాజు నికోలస్ జార్ సింహాసనాన్ని వీడారు. అప్పుడు తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభ. ్త్వం మ. హిళలకు ఓటు వేసే హక్కును ఇచ్చింది. 8 మార్చి 8న. మహిళలు సమ్మెకు దిగిన రోజు జూలియన్ క్యాలెండర్ ప్రకారం, ఫిబ్రవరి 23వ తేదీ ఆదివారం. కానీ గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది మార్చి 8వ తేదీన వచ్చింది. అందుకే ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ. 1975వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తించింది. స్త్రీ, పురుషులకు సమాన హక్కుల కోసం పోరాడే వారికి ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం చక్కని వేదిక అని చెప్పొచ్చు. ఈరోజున మహిళలు తమ హక్కుల కోసం ఎంతలా పోరాటం చేశారో.. వారికి ఇంకా అవసరమైన వాటి కోసం గళమెత్తడం, అడ్డంకులను అధిగమించడం, ఒక శతాబ్దానికి పైగా చరిత్రలో వీరికి పెరుగుతున్న బలాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చుఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహించి, సంబరాలు ప్రారంభించింది. తదనంతరం, ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మహాసభ ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు , ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. దీని తర్వాత ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా ఖచీ కొత్త థీమ్‌ను ప్రవేశపెడుతుంది. మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడడమే కాకుండా, లింగ ఆధారిత భేదాలు, సమానత్వ లక్ష్యం, మహిళల హక్కులు మొదలైన వాటి గురించి కూడా ఈ రోజున అవగాహన కల్పిస్తారు. సంక్షేమంపై దృష్టిసారించిన వివిధ మహిళా సంఘాలు ఈ రోజున నిధులు సమకూరుస్తున్నాయి. "కడుపులో బిడ్డ ఆడా.. మగా అని తెలుసుకోవడంలో మొదలయ్యే వివక్ష.. కష్టపడి.. గొడ్డు చాకిరీ చేసి.. తన జీవితమంతా పిల్లల కోసమే బతికి.. చివరకు కాళ్లు, చేతులు కదలలేని పరిస్థితుల్లో.. వృద్ధాశ్రమానికి చేరుకునే వరకు 'ఆమె' పై వివక్ష అలానే కొనసాగుతుంది.

## ఆధునికంగా మహిళలు

ఇక ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా దూసుకుపోతున్నారు.. రాజకీయ, పరిపాలన, వ్యాపార, క్రీడా, రంగాల్లోనే కాక అన్ని రంగాల్లోనూ పురుషులకు ఏ మాత్రం తీసిపోని విధంగా అన్నింటా ఎందరో మహిళలు ఉన్నత స్థానంలో ఉన్నారు. అయినప్పటికీ ఎక్కడో లోపం. నిద్రలేచిన వెంటనే ఏ పేపర్ చూసినా, టీవీ ఛానళ్లు చూసినా ప్రముఖంగా కనిపించే అత్యంత దయనీయమైన వార్తలు అది పుట్టిన పసిబిడ్డ నుండి మొదలు పెట్టి ఆరు పదుల వయస్సులో ఉన్న వృద్ధురాలిని సైతం స్త్రీ పట్ల వికృత చేష్టలు, పాశవిక చర్యలు కనిపిస్తుంటాయి. నేటికి మహిళలపై వివక్ష దారుణంగా కొనసాగుతోంది.

బాల్య వివాహాలు, అవిద్య కొంత మేరకు తగ్గినా, మహిళలపై అత్యాచారాలు, హింస, వరకట్న వేధింపులు చూస్తుంటే సామాజికంగా, రాజకీయంగా రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ల పుణ్యమా, అని పదవులు మహిళలకు దక్కినా పెత్తనం మాత్రం పురుషులదే. అత్యున్నత స్థానంలో ఉన్న మహిళలదీ ఇదే దుస్థితి. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు గత ఏడాది మోక్షం కలగడం ముదావహం. ఇలా భారతదేశంలో మహిళల చరిత్ర అనేక సంఘటనల సమాహారంగా ఉంది. ఆధునిక భారతదేశంలో మహిళలు దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ సభాపతి, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారు. భారతదేశపు ఇటీవలి రాష్ట్రపతి కూడా ఒక మహిళే.

## మహిళా సాధికారత :

ఆ నాటి నుండి నేటికి, గత శతాబ్దాలతో పోల్చినప్పుడు, ఈ రోజుల్లో మహిళలు ఎక్కువ అక్షరాస్యులు, విద్యావంతులు, ఉద్యోగం మరియు నాయకత్వం వహించడానికి ముందుకు పోతున్నారు.. మహిళలు సాంఘిక జీవితంలో మరియు రాజకీయ రంగంలో అభివృద్ధి సమూల మార్పులకు దోహదపడే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రభావ సాధికారతకు, ఏదైనా చేయటానికి అధికారం శక్తి ఇవ్వబడుతోంది, బలంగా నమ్మకంగా మారడం, ఒకరి హక్కులు గురించి తెలుసుకోవడం ఒకరి జీవితాన్ని మరింత అర్థవంతంగా నెరవేర్చగల మార్గంలో నియంత్రించే సామర్థ్యం కలిగి ఉండటం. మహిళలు తాము వ్యక్తులు అని గుర్తించడానికి, కుటుంబానికి, పని ప్రదేశంలో సమాజంలో చురుకైన మద్దతు ఇవ్వడానికి గుర్తించబడింది. 2001 జాతీయ జనాభా లెక్కల డేటా విడుదలైన తరువాత ఇది మరింత తీవ్రతరం అయ్యింది. ఆడపిల్లలు మరియు అబ్బాయిల పుట్టుక మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించడానికి, భారత ప్రభుత్వం బేటీ బచావో బేటీ పధావోను ప్రోత్సహించడానికి ఒక చొరవ తీసుకుంది మరియు 'గర్ల్ చైల్డ్ సేవ్' ను ప్రోత్సహించడానికి మరియు 'గర్ల్ చైల్డ్ ను విద్యావంతులను చేయడానికి' అనేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. జనవరి 2015 నుండి. ఈ ప్రచారానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుండి మద్దతు లభించింది. ఇంతటి ప్రోత్సాహం కలిగి ముందుకుపోవడానికి ఇంకా ఏదో ఆటంకం, పురుషులలో స్త్రీ పట్ల దృష్టిని మనో వికారం కలిగించే దృష్టిని మర్చలేకపోవడం. అనేకానేక చోట్ల రేప్ చేసి చంపేయడం, కాల్చి పారేయడం. కళ్ళు అయిన తెరవని పసి కందుని సైతం వదలని మానవ మృగాలు ఇబ్బంది పెడుతూ సభ్య సమాజం తల దించుకునేలా చేస్తున్న తార్కాణాలు కోకొల్లలు టి.వి.చానెల్సో ప్రతి నిత్యం కళ్ళెదుట కనిపిస్తూనే ఉన్నాయి. మొన్నటి షాద్ నగర్, తెలంగాణా రాష్ట్రంలో జరిగిన దిశని రేప్ చేసి కాల్చి పారేసిన ఆగంతుకుల కిరాతకం ఆ దుర్ఘటనల నేపథ్యం, దిశ కుటుంబానికి ఆసరాగా దేశం మొత్తం కదిలివచ్చిన సంఘటన, రాష్ట్ర ప్రభుత్వం కిరాతకులను హతమార్చే విధంగా తగిన చర్యలు చేపట్టడంతో యావత్తూ భారతావని హర్షించడం గమనార్హం. భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. భారత ప్రభుత్వం మహిళల సమస్యలను దేశ ఆర్థిక వ్యవస్థకు వారి సహకారాన్ని గుర్తించింది. భారతదేశంలో మహిళలకు అందుబాటులో ఉన్న మహిళా సాధికారత కార్యక్రమాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

## మహిలా-ఇ-హాట్:

ఇది మహిళా పారిశ్రామికవేత్తలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (ఎస్‌హెచ్‌జి) ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఒ) లకు మద్దతుగా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ప్రత్యక్ష ఆన్‌లైన్ మార్కెటింగ్ వేదిక. 'డిజిటల్ ఇండియా' చొరవలో ఇది ఒక భాగం. మహిళలు తమ పనిని విస్తృత మార్కెట్‌లో ప్రదర్శించడానికి ఖఝ.ఝఞ్ఞఅశ్రీఖవఘ్లుఖ్-తీఎ.ఎ.్ౖరశీజ. అఅ పరపతి సాంకేతిక పరిజ్ఞానంలో తమను తాము నమోదు చేసుకోవచ్చు.

## "బేటి బచావో", "బేటి పడావో":

ఇది ఆడ భ్రూణహత్యల నిర్మూలన మరియు భారతీయ యువతుల కోసం ఉద్దేశించిన సంక్షేమ సేవలపై అవగాహన పెంచడం లక్ష్యంగా చేసిన సామాజిక ప్రచారం. "సేవ్ ది గర్ల్ చైల్డ్" ఉద్యమం 22 జనవరి 2015న ప్రారంభించబడింది, ఇది మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తుంది. బేటీ బచావో, బేటి పధావో - ప్రారంభ నిధుల రూ.100 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇది ప్రధానంగా ఉత్తరాఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ మరియు హర్యానాలోని క్లస్టర్‌లను లక్ష్యంగా చేసుకుంది. భారతదేశంలో, 0-6 సంవత్సరాల వయస్సులో పిల్లల లింగ నిష్పత్తి 1000 మంది అబ్బాయిలకు 931 మంది బాలికలుగా ఉంది మరియు ఇది 2011 లో ప్రతి 1000 మంది అబ్బాయిలకు 918 మంది బాలికలకు పడిపోయింది. భారతదేశంలో సెక్స్ - సెలెక్టివ్ అబార్షన్ లేదా ఆడ భ్రూణహత్యలు పదునైనవి దేశంలోని కొన్ని రాష్ట్రాల్లోని అబ్బాయిలకు భిన్నంగా జన్మించిన బాలికల నిష్పత్తిలో క్షీణత. బాలల లింగ నిష్పత్తిలో విస్తృత అంతరం 1991 లో జాతీయ జనాభా లెక్కల డేటా విడుదలైనప్పుడు గుర్తించబడింది. 2001 జాతీయ జనాభా లెక్కల డేటా విడుదలైన తరువాత ఇది మరింత తీవ్రతరం అయ్యింది. ఆడపిల్లలు, అబ్బాయిల పుట్టుక మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించడానికి, భారత ప్రభుత్వం బేటీ బచావో బేటీ పధావోను ప్రోత్సహించడానికి ఒక చొరవ తీసుకుంది మరియు 'గర్ల్ చైల్డ్ సేవ్' ను ప్రోత్సహించడానికి 'గర్ల్ చైల్డ్ ను విద్యావంతులను చేయడానికి' అనేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. జనవరి 2015 నుండి. ఈ ప్రచారానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుండి మద్దతు లభించింది.

## ఐ యామ్ జనరేషన్ ఈక్వాలిటీ :

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2020 యొక్క థీమ్ "ఐ యామ్ జనరేషన్ ఈక్వాలిటీ రియలైజింగ్ ఉమెన్స్ రైట్స్". ఇది సామూహిక వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది, అనగా, సమిష్టి చర్యతో మరియు ఆరోగ్యకరమైన, సంపన్నమైన మరియు మరింత శ్రావ్యంగా ఉండే లింగ సమానత్వ ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యంతో భాగస్వామ్య బాధ్యతతో. ఒక జూఖూూ బౌూాణ అనేది ప్రారంభించబడిన ప్రపంచం. గ్లోబల్ జెండర్ గ్యాప్... అంటే ప్రపంచ దేశాల్లో స్త్రీపురుమల ప్రగతి మధ్య వ్యత్యాసం 68.4 శాతం ఉందనీ, సమానత్వం సాధించా. లంటే ఎంత లేదన్నా 131 ఏళ్లు పడుతుందనీ గతేడాది ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. ఆ నేపథ్యంలోనే నూటికి నూరుశాతం సమానత్వానికి చేరువలో ఉన్న దేశాల ప్రస్తావన వచ్చింది. సమానత్వ పట్టికలో తొంభై శాతానికిపైగా మార్కులు కొట్టేసి పద్నాలు గేళ్లుగా ఐస్లాండ్ తొలి స్థానాన్ని నిలబెట్టుకుంటుండగా, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్ లాంటి దేశాలూ కొద్దిపాటి తేడాతో దాని వెన్నంటే ఉంటున్నాయి. గతేడాదే వెలువడిన 'విమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ ఇండెక్స్'లో తొలిస్థానం సంపాదించిన డెన్మార్క్ని పలు కోణాల్లో విశ్లేషించిన సామాజికవేత్తలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. నిజంగా సమాజం మారాలనుకుంటే వందల ఏళ్లు అక్కర్లేదనీ ఒక్క తరం-అంటే, పట్టుమని పాతికేళ్లు కృషిచేస్తే చాలనీ పేర్కొన్నారు. నమ్మకం. సమానత్వం, సంక్షేమం... అక్కడి సమాజపు ఈ మూడు ముఖ్య లక్షణాలకు మహిళల ఉద్యమాలు తోడు కాగా ప్రగతి బాట పట్టి, మహిళలు జీవించడానికి మంచి దేశంగా పేరు తెచ్చుకున్న డెన్మార్క్ మోడల్ని ఎవరైనా అనుకరించవచ్చంటారు నిపుణులు.

## మహిళాశక్తికి నజరానా :

అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరగబోతుండగా సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. మహిళల శారీరక పరిస్థితులను సాకుగా చూపి లేదా సామాజిక నియమాలను కారణాలుగా చూపి సైన్యంలో వారిపట్ల వివక్ష అమలు చేయడం తగదని స్పష్టం చేసింది. పురుషులతో సమానంగా వారికి కూడా అన్ని బాధ్యతలనూ అప్పగించాలన్న తొమ్మిదేళ్లనాటి ఢిల్లీ హైకోర్టు తీర్పును రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ సమానమేనని, వారికి సమానావకాశాలు లభించి తీరాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చాక వైమానిక దళం దాన్ని శిరసావహించింది. కానీ నావికాదళం, సైన్యం తమ తప్పు సరిదిద్దుకోలేదు. సైన్యమైతే బాహాటంగా వ్యతిరేకించింది. అప్పట్లో శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాల్సిన మహిళా అధికారులు 40మందికి మొండిచేయి చూపింది. దీనిపై వారు మళ్లీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాల్సివచ్చింది. మరోపక్క ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్రం సుప్రీంకోర్టుకెక్కింది. తాజా తీర్పు ఢిల్లీ హైకోర్టు తీర్పునే ధ్రువీకరించింది. సమానత్వానికి పూచీపడుతున్న రాజ్యాంగంలోని 14వ అధికరణకు భిన్నంగా వ్యవహరించడం తగదని తాజా తీర్పు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సైన్యంలో వున్నవారు ఎవరైనా తగిన శక్తిసామర్థ్యాలు కలిగివున్నారో లేదో, లక్ష్యాలను పరిపూర్తి చేయగలుగు తున్నారో లేదో చూడాలి. ఈ అంశాల్లో మహిళల పనితీరు సంతృప్తికరంగా లేదనుకుంటే ఆ సమాచారాన్ని న్యాయస్థానం ముందుంచాలి. కార్గిల్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ సైన్యం దాడులకు దిగినప్పుడు మహిళా సైనికులు ఎక్కడా వెరవలేదు. తక్షణ స్పందనలో పురుష సైనికులకు వారెక్కడా తీసిపోలేదు. సుశిక్షిత సైనికులు తమకు ఆదేశాలిచ్చే అధికారిలో తగిన శక్తిసామర్థ్యాలున్నాయా లేదా, చిత్తశుద్ధి

ఉందా లేదా అని చూస్తారు తప్ప ఆడా మగా అని చూడరు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా అధికారులే ఇందుకు నిదర్శనం. ఆ శాఖలో ఎందరో ఐపీఎస్ అధికారిణులు, ఇతర మహిళా అధికారులు విధి నిర్వహణలో అద్భుతమైన శక్తిసామర్థ్యాలు ప్రదర్శిస్తున్నారు. సంక్షోభాలు, ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు సిబ్బందిని మెరుగ్గా నడిపిస్తున్నారు. ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. సైన్యంలో అది సాధ్యం కాదని చెప్పడం పురుషాధిపత్య ధోరణులను ప్రోత్సహించడమే అవుతుంది. తాజా తీర్పు పర్యవసానంగా మహిళలు కల్నల్ స్థాయికి, అక్కడినుంచి బ్రిగేడియర్, మేజర్ వగైరా స్థాయిలకు చేరుకుంటారు. జర్మనీ, నార్వే, అమెరికా వంటి దేశాలు మహిళలను యుద్ధాల్లో కూడా భాగస్వాముల్ని చేస్తున్నాయి. ఏదేమైనా ఈ తీర్పు చరిత్రాత్మకమైనది. భవిష్యత్తులో మహిళల రణరంగ ప్రవేశానికి సైతం ఇది బాటలు పరుస్తుందనడటంలో సందేహం లేదు. మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ సెలవుదినం. మహిళా దినోత్సవం ఎందుకు, ఎలా మొదలైంది..? అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి వందేళ్లు దాటినా గొప్ప చరిత్ర ఉంది. 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లను అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. 1909 ఫిబ్రవరి 28న ఖూాలోని న్యూయార్క్ నగరంలో ఖూ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ ఈ రోజును ప్రతిపాదించారు. రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ. దీని ప్రాముఖ్యతను చూసి ముగ్ధులయిన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. 1910 సంవత్సరంలో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ యొక్క కోపెన్ హాగన్ సమావేశంలో మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ హోదా లభించింది. ఆ సమయంలో మహిళలందరికీ ఓటు హక్కు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. అయితే, ఆ సమయంలో నిర్దిష్ట తేదీని నిర్వచించలేదు.

## ఈ ఏడాది మహిళల లక్ష్యం :

భారత దేశం ప్రతి సంవత్సరం, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం, లింగ సమాన ప్రపంచాన్ని సృష్టించడం లక్ష్యం. ఇది స్త్రీ విజయాన్ని జరుపుకోవడం, పక్షపాతానికి వ్యతిరేకంగా అవగాహన పెంచడం. కాబట్టి మనమందరం మార్పు తీసుకురావడానికి 'సవాలు' ఎంచుకోవాలి. ఈ సంవత్సరం ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ మహిళలంతా ఐక్యంగా, ఆనందంగా మహిళాదినోత్సవం జరుపుకుంటూ, శక్తివంతంగా, అజేయంగా ఉండాలసిన ఆవశ్యకత ఉంటుంది. ఆమె టీచర్, ఉద్యోగి, గృహిణి, ఆర్థికవేత్త, ఇంజనీర్ లేదా మార్గదర్శకురాలు అయినా, మహిళలు తమ అనంతమైన శక్తి, సంకల్పం మరియు నమ్మకంతో ఈ ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా మార్చుకోవడం అత్యవసరం. మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు.

జై భారత్! జై హింద్!



-శారదా శృంగేరి
94902 61119

## మహిమాన్విత మహిళా



అవనియందు సహనశీలి
జగన్మాతగా నిలిచిన పరాశక్తి
అందమైన ప్రకృతిగా అమృతమై
ప్రతి ఇంట వెలుగు పంచు దీపం స్త్రీ

ఇలవేల్పుగా నిలిచిన గృహ లక్ష్మి
మాతృమూర్తిగా మమత పంచి
మగువగా అనురాగం పంచుతూ
మరో జన్మకు జన్మనిచ్చే అద్భుతం స్త్రీ.

అమ్మలోని కమ్మదనం పంచుతూ
ఆకలి తీర్చే అన్నపూర్ణ మగువ
వంశాభివృద్ధికి వారధిగా నిలుస్తూ
నయనమై లోకం చూపు మనోహరం స్త్రీ

అన్ని రంగాలలో ప్రతిభ చూపెడుతూ
సహనంలో సముద్రమై నిలుస్తూ
ఆత్మవిశ్వాసమే ఆభరణంగా
మేటైన మానవ మేధస్సు రూపం స్త్రీ.

సమాజ నిర్దేశకురాలిగా దిక్సూచి
సులక్షణ సుశిక్షితురాలైన స్ఫూర్తి
అణుకువ మకుటమైన మానవతా
జీవి జీవితానికి జీవన మూలం స్త్రీ
అన్ని తానై
అపురూప మణిగా వెలిగే మహిళకు
వందనం అభివందనం



-సి. హేమలత
9666779103

## "స్త్రీ"

సూర్యుని సింధూరం
నుదుట ధరించి
చంద్రుని చలువని
కన్నుల్లో దాచుకుని
వెన్నలాంటి ప్రేమని
గుండెల్లో పెంచుకొని
లాలించి, పాలించే
పావని స్త్రీ!
కష్టాల తెరలను
కాటుక చాటున దాచి
ఆనంద భాష్పాలంటూ
విడుస్తోంది!
తన వివర్ణమైన
మనసుని దాచుకొని
తను సంధ్యా సౌందర్యమై
భాసిల్లుతోంది!



-కమలేకర్ శ్యాం ప్రసాద్ రావు.
9441076632

# నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**- ఈనెల 8, 9, 10 తేదీలలో**

హైదరాబాద్, మార్చి 7: నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో ఈనెల 8, 9, 10వ తేదీలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. నెక్సస్ హైదరాబాద్ మాల్ ప్రత్యేక సందర్భాలలో తమ కస్టమర్లకు ప్రత్యేక అనుభవాన్ని అందించడానికి ఈవెంట్‌లు, ఆన్-గ్రౌండ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాల్‌కు వచ్చే మహిళలందరికీ పూలతో స్వాగతం పలుకుతారు. మహిళల కోసం ప్రత్యేకమైన, ఉత్తేజకరమైన డీల్‌లను అందిస్తుంది. మాల్‌లో మార్చి 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సిమ్సమ్ ఆర్ట్స్ సహకారంతో మహిళా కళాకారులతో లైవ్ ఆర్ట్ షో ఉంటుంది.

ఈ ఆర్ట్ షోలో ప్రేక్షకులు యాక్రిలిక్ పెయింటింగ్, డాట్ మాండలా, గౌచే పెయింటింగ్, సాఫ్ట్ పాస్టల్స్, ఆయిల్ పాస్టల్స్, కలర్ పెన్సిల్స్, కాన్వాస్ ఆర్ట్స్, బొగ్గుతో సహా వివిధ రకాల కళలలో తమను తాము నిమగ్నం చేసుకోవచ్చు. బ్రాండ్ విలువలకు కట్టుబడి, లైవ్ ఆర్ట్ షో, నవ్ యోగా సహకారంతో మార్చి 9వ తేదీన ఫ్లాష్ యోగా సెషన్ ఉంటుంది. యోగా, శాస్త్రీయ నృత్యాల కలయికతో మహిళల దైనందిన జీవితంలో యోగా ప్రయోజనాలపై అవగాహన పెంచడానికి ఉద్దేశించబడింది. మాల్‌లో వివిధ వర్క్‌షాప్‌లు, లైవ్ ఆర్ట్ వేలం పాటలు, జానపద నృత్య ప్రదర్శనలు, జుంబా డ్యాన్స్ సెషన్ కలదు. మహిళలు వివిధ కార్యకలాపాలలో పాల్గొనడానికి, షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరచుకోవడానికి వీలు కల్పిస్తాయి. దుకాణదారులు కూడా ప్రత్యేక తగ్గింపులు ఇస్తారు. 2ఎక్స్ రివార్డ్‌లను పొందే అవకాశం, బహుమతి ఓచర్‌లను గెలుచుకునే అవకాశాన్ని అందిస్తారు.

# క్లైమేట్ ఇంపాక్ట్ ను అందించనున్నఎంఐఎఫ్ ప్లాస్టిక్ వ్యర్థాల వినూత్నతలు



హైదరాబాద్, మార్చి 7:పన్నెండు స్టార్టప్‌లు కలసి వినూత్నమైన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల నిర్వహణ పరిష్కారాలను కొత్త వ్యాపార నమూనాలుగా మార్చాయి. గత 12 నెలల్లో ఏకంగా 124,360 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను ఆదా చేశాయి. ఈ స్టార్టప్‌లు జనవరి 2023లో 'ఇన్నోవేషన్ ఇన్ ప్లాస్టిక్స్: ది పొటెన్షియల్ అండ్ పాసిబిలిటీస్' ప్లేబుక్‌లో ప్రదర్శించబడిన మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఓఎఈ) ప్లాస్టిక్ పోర్ట్ ఫోలియోలో భాగం. ఎంఐఎఫ్ దీనిని, ఇతర డేటా పాయింట్లను ప్లాస్టిక్ ప్రోగ్రామ్ రౌండప్ 2023-24లో విడుదల చేసింది. ఇది ఒక రోజంతా జరిగే కార్యక్రమం, ఈరోజు ఇక్కడ జరుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ విలువ గొలుసులో ఎంఐఎఫ్ కేంద్రీకృత జోక్యం ప్రభావాన్ని ఈ స్టాక్-టేకింగ్ సమీక్షించింది. ఇది ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించడానికి ఆవిష్కర్తలకు అవకాశాలను అందిస్తుంది. ఎంఐఎఫ్ ప్లేబుక్ ప్రకారం, భారతదేశ ప్లాస్టిక్ వినియోగం పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. 2016-17లో 14 మిలియన్ టన్నుల నుండి 2019-20లో 20 మిలియన్ టన్నులకు పెరిగింది. అదే సమయంలో, ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి కూడా రెండింతలు పెరిగింది. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఏటా 3.4 మి లియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నప్పటికీ, భారతదేశం కేవలం 30% మాత్రమే రీసైకిల్ చేస్తోంది.

'భాషావిభూషణ' డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ
ఆత్మకథ
'మట్టిబండి' తృతీయ ముద్రణ
ఆవిష్కరణోత్సవం



వేదిక : పద్మావతి కళావేదిక, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం బృందావన్ గార్డెన్స్, గుంటూరు
సమయం : ది.10-03-2024, ఆదివారం ఉదయం 10 గం.లకు
సభాధ్యక్షులు : డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, విమర్శకుడు
జ్యోతి ప్రజ్వలన : శ్రీ చిటిపోతు మస్తానయ్య ఆలయ కమిటి అధ్యక్షులు
గ్రంథావిష్కరణ : శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు
ముఖ్య అతిథి : డాక్టర్ నాళేశ్వరం శంకరం కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు
ఆత్మీయ అతిథి : శ్రీ వల్లూరి శివప్రసాద్ కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు
పుస్తక సమీక్ష : శ్రీమతి పింగళి భాగ్యలక్ష్మి
సభా నిర్వహణ : డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు
అందరూ ఆహ్వానితులే
ఆహ్వానించువారు
డాక్టర్ జెక్కంపూడి సీతారామారావు
అధ్యక్షులు, ఎన్.జి. రంగ ఫౌండేషన్ - గుంటూరు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.

# సమాజంలో మహిళల పాత్ర కీలకం



రాజన్న సిరిసిల్ల, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి): సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని బోయిన్పల్లి మండలంలోని విలాసాగర్ హై స్కూల్ హెచ్ఎం బోలగం శ్రీనివాస్ అన్నారు. గురువారం హైస్కూల్ ఆవరణలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులైన వసుంధర ,రాధిక, స్వర్ణలత, శమంతకమణి మహిళా ఉపాధ్యాయులను ఘనంగా పాఠశాల హెచ్ఎం బొలగం శ్రీనివాస ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు మహిళల ప్రాధాన్యత గురించి తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, వెంకట హనుమాన్, సురేందర్ రెడ్డి, మధుసూదన్, ప్రకాష్,పిఇటి మధుకర్ రెడ్డి,జూ అ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**-కరాటే లో రాణించిన కేరళ మోడల్ విద్యార్థులకు మెడల్స్ ప్రధానం**



రాజన్న సిరిసిల్ల, మార్చి 7:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో ఆదివారం మహాలింగేశ్వర గార్డెన్లో ఓకినవ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని కేరళ మోడల్ పాఠశాలకు చెందిన16 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో కటాస్ వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పత కాలు సాధించారు. గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మెడల్స్, సర్టిఫికెట్ అందజేసే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అలాగే కరాటేకి ప్రోత్సహిస్తున్న తల్లితండ్రులను అభినందించారు. పిల్లలకి కరాటే శిక్షణ ఇప్పిస్తున్న స్కూల్ కరెస్పాండెంట్ సతి, మనోజ్ కుమార్ లను అలాగే విద్యార్థులు మెడల్స్ సాధించుటకు కృషిచేసిన కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశాల్ కుమార్. విద్యార్థుల తల్లదండ్రులు పాల్గొన్నారు

# సోలార్ ఎనర్జీ విప్లవంలో గ్రీన్ పవర్ సొల్యూషన్స్ ముందంజ



హైదరాబాద్, మార్చి 7:సుస్థిర భవిష్యత్తు కోసం అన్వేషణలో గ్రీన్ పవర్ సొల్యూషన్స్ సోలార్ ఎనర్జీ విప్లవంలో ముందంజలో ఉంది. 2018లో ప్రారంభమైనప్పటి నుండి, కంపెనీ వివిధ పారిశ్రామిక మరియు వాణిజ్య రంగాలలో సౌరశక్తిని ఏకీకృతం చేయడం ద్వారా వినూత్న సౌర పరిష్కారాలకు మార్గదర్శకత్వం వహిస్తోంది. పర్యావరణ సుస్థిరత మరియు వ్యయ సామర్థ్యానికి స్థిరమైన నిబద్ధతతో, గ్రీన్ పవర్ సొల్యూషన్స్ సౌర విద్యుత్ ప్లాంట్ల రూపకల్పన, ఇంజనీరింగ్, సేకరణ, సంస్థాపన మరియు నిర్వహణతో కూడిన సేవల యొక్క సమగ్ర సూట్‌ను అందిస్తుంది. వారి నైపుణ్యం సోలార్ ఇఖఅ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్స్ట్రక్షన్) మరియు పర్యావరణపరంగా స్థిరమైన వెంచర్‌ల మోనటైజేషన్‌లో ప్రత్యేకత కలిగిన పెద్ద-స్థాయి సోలార్ ప్రాజెక్టులలో ఉంది. సంస్థ యొక్క పోర్ట్‌ఫోలియో వారి క్లయింట్‌ల ప్రత్యేక అవసరాలను తీర్చడానికి రూపొందించబడిన ఆన్-గ్రిడ్, ఆఫ్-గ్రిడ్ మరియు హైబ్రిడ్ సోలార్ పవర్ ప్లాంట్‌లతో సహా విభిన్నమైన ప్రాజెక్టలను కలిగి ఉంది. అతుకులు లేని అమలు మరియు అసాధారణమైన సేవా నాణ్యత ద్వారా, గ్రీన్ పవర్ సొల్యూషన్స్ వారి టర్న్‌కీ సొల్యూషన్స్ ఖర్చులను తగ్గించి, పొదుపును పెంచేలా చేస్తుంది.